


## ౧. సామాన్యుని వాస్తవికత

ఈరోజున సామాన్యుడు
ఏమీ లేనట్టివాడు
కూడూ గూడూ గుడ్డా
ఏవీ లేనట్టివాడు
చదువూ సామూ శాస్త్రం
ఏవీ యెరగని వాడు

ఈరోజున సామాన్యుడు
సగం దేవతాంశ సగం
రాక్షసాంశ, సగటున ఈ
సామాన్యుడు మానవుడు
అంటే నీవూ నేనూ
ఆమె ఈమె వీడు వాడు
అంతా సామాన్యులమే
సగం వెలుగు సగం నీడ

సగం ఋతం సగ మనృతం
సగం ఆడ సగం ఈడ
సగం పశువు సగం నిసువు
ఈ వెల్తురు ఈ చీకటి

ఈ యిరులూ ఈ వెలుగూ
వేరువేరు గదులు కావు
ఒకటే రెండూ కూడా
ఇపుడు నిప్పు ఇపుడె పువ్వు

ఇప్పుడు దూసిన ఖడ్గం
ఇంతట్లో కౌగిలింత
ఒక నేత్రం కల్హారం
మరోకన్ను కర్పూరం

మూడో కంటి వాడంటూ
లేడంటే నమ్ముతావ్
చూడవోయ్ నీలోకి నీవు
ఒకటి రెండు వెరసి మూడు

నరకం స్వర్గం అన్నది
ఒక స్థితికే రెండు పేర్లు
ఫోకస్ భేదం అంతే
లోకస్ రెండిటి కొకటే

శ్రీ అనగా లక్ష్మి, సరే
శ్రీ అంటే విషం కూడా
శ్రీ శ్రీ సిరి చేదు, లేక
సిరి సిరి, చేదు చేదు

మీ యిష్టం శ్రీకారం
గుణకారం చేసుకోండి
మీకే అర్థం తోస్తే
ఆ Key నే వాడుకోండి

ఒకటే శ్రీ అదే రెండు
అదే చేదు సిరి అదే

అమరత్వం అసురత్వం
శ్రీ శ్రీ ఒక మానవుడు

## ౨. నేపథ్యంలో :

నీ మూసిన పిడికిటిలో
ఏమున్నది కవీ కవీ
ఆదాచిన పత్రాలలో
ఏం తెచ్చావ్ సుకవీ

ఆ మూలని సంచీలో
ఏమున్నది కవీకవీ
నీమూసిన గుండెల్లో
ఏం దాచావ్ సుకవీ

నీ పాడని పాటలలో
రాపాడే దేవికవీ
ఆ కొసలో నీడలలో
ఏసత్యం సుకవీ

ఏసత్యం ఏస్వప్నం
ఏస్వర్గం సుకవీ
మాకోసం నీకోసిన
వేకాన్కల పూలు కవీ

## 3. సామాన్యుని కామన:

సైన్సువల్ల ఈ రోజున
సామాన్యుని బతుకుకూడ
సౌందర్యమయం కాగల
సదుపాయం లభించింది

జన్మం చర్మం వెనకటి
సంప్రదాయమూ ఇప్పటి
సంఘస్థితులూ చెరపే
అసమానత పనికిరాదు

ఐశ్వర్యం అందరిదీ
అందుచేత అందులోన
సామాన్యుడు తన వాటా
తనకిమ్మని కోరుతాడు

బతకడమే సమస్యగా
పరిణమింప జేసినట్టి
అన్యాయాలన్నిటినీ
మంతమార్చాలంటాడు.

'ఇదేం పెద్ద గగనమా ? మ
రిదేం గొప్ప కోరికా? ఇ
కేం? ఇదొక్క విప్లవమా?
ప్రశ్నిస్తే పాపమా ?

యంగసంధిది, సామాన్యుని
శకం దీన్ని కాదనరా
దిది రేపొచ్చే వ్యవస్థ
కివాళనించీ పునాది
ఇప్పటినించీ నాంది

అంతే, ఇంతే స్వప్నం !
అన్నీ ఒక్కడికి బదులు
అంతమందికీ అన్నీ !
అదే స్వర్గమంటాను

ఆ స్వర్గం వేరే కడు
దూరంలో లేదు లేదు
ఈడే చేడే వున్నది.
నీలో నాలో వున్నది.

మీ యిష్టం ఈ ధాత్రిని
చేయవచ్చు స్వర్గంగా
చీల్చవచ్చు నరకంగా
ఏంచేస్తారో సరిమరి యిక మీయిష్టం.

(మొన్న ఉగాదినాడు విజయవాడ
రేడియో కేంద్రంనుండి ప్రసారితం)

పాకిస్తాను నుండి తరిమివేయబడ్డ ప్రతి ఒక్కమనిషికీ బదులుగా ఒక్కొక్క మనిషిని మనం యిక్కడనుండి తరిమివెయ్యాలని–పార్లమెంటులో ఉపన్యసిస్తూ శ్రీ కె. హనుమంతయ్య అన్నట్టు పత్రికల్లో వార్త.

ఈ కార్యక్రమం లాయక్ ఆలీని తరిమెయ్యడంతో మనం అప్పుడే ప్రారంభించామని "శంకర్స్ వీక్లీ" వ్యాఖ్య.